చావు బ్రతుకులను కలుపుతూ తిన్నగా సాగే సరళరేఖ లాంటి జీవిత ప్రయాణంలో అనుకోని మలుపులు సున్నితుడైన అతను సులువుగా తిరగగలిగాడా?

మోహిత

# 7 కూసింత చోటు





హఠాత్తుగా తల ఎత్తిన అతనికి ఎదురుగా ఒక హోర్డింగ్ కనపడింది. ఈ తెలుగువాళ్లకి సహనం మామూలుగా లేదుగా! 'Natural remedy for hair growth' అని ఆంగ్లంలో ఉన్న వాక్యం పక్కనే 'ప్రకృతి సహకరించే అందపు జుట్టు' అని తెలుగులో రాసుంది. దాని కింద ముందు, తరువాత అని ఒక బట్టతల బాబువి ఫోటోషాప్ చేసిన రెండు ఫోటోలు, ఎర్రరంగులో ఉన్న నూనెసీసా కేవలం కొంతకే అని ఓ టోల్ ఫ్రీ నంబర్. ఇంత ప్రజ్ఞావంతమైన అనువాదాన్ని అతను ఎప్పుడూ చూసి ఉండకపోవటం చేత చటుక్కున జేబులోంచి ఫోన్ తీసి ఫోటో తీసి ఒక ప్రముఖ తెలుగు దినపత్రికకు అప్పటికప్పుడే ఫోన్‌లోనే ఈమెయిల్ చేసేద్దాం అన్నంత కోపం వచ్చింది. గ్రీన్ లైట్ మరో ముప్పై సెకన్లలో పడుతుందనగా వాహనాలు కదలసాగాయి. దాంతో బల వంతంగా తన ఆవేశాన్ని నిగ్రహించుకొని ఇంజన్ స్టార్ట్ చేశాడు.

గేర్ మారుస్తూ మణికట్టుకున్న పాత గడియారాన్ని చూశాడు. ఐదుంబావు. టైం లేదు, ఎలా అయినా సరే ఒక అరగంటలో చేరుకో వాలి. ఈ లోపు చేరుకోలేకపోతే...? వెనక నుంచి ఒకటే హారన్ల మోత. మళ్లీ ఆవేశం. గ్రీన్ లైట్ పడ్డాక బండి తీయక అక్కడే కాపురం చేస్తారా ఏంటి? ఆగి చావలేరు వెధవలు. చిరాకుపడ్డాడు.

కూడలి దాటాక బండ్ల ఉద్గారాలు తగ్గి కొంచెం మంచి గాలి వీచసాగింది. గుండెల నిండా గాలి పీల్చుకుందామని ప్రయత్నించాడు. నాలా నుంచి వచ్చిన దుర్గంధం అతని ఊపిరితిత్తుల్లోకి చేరి వికారాన్ని కలిగించి వాంతిలా బయటకు ఉరికింది. లెఫ్ట్ నుంచి ఓవర్ టేక్ చేసిన ఓ బైక్ మెరుపులా మాయమైంది. ఇంకా నయం, వాడి మీద గానీ పడుంటే? అయినా ఆ వేగం చూస్తే వాడి కొంపలు అంటు కున్నట్టే ఉంది. తనకంటేనా? వైరాగ్యం, నైరాశ్యం కలిసిన నవ్వు - అతనికి మాత్రమే సాధ్యమయ్యే నవ్వొకదాన్ని నవ్వాడు. అది గమ నించటానికి ఎవరికీ టైం లేదేమో, పాలోమని వెళ్లిపోతున్నారు.

మరీ ఇంత సున్నితమైతే ఎలా? తల్లి ఎన్నిసార్లు అనేది ఈ మాటని! అబ్బాయి అంటే రఫ్ అండ్ టఫ్‌గా ఉండాలని ఆమె బలంగా నమ్మింది. ఏ విషయానికైనా ఆడవాళ్లు ప్రతిస్పందించే తీరుకి పూర్తిగా వ్యతిరేకంగా, భిన్నంగా ఉండటమే పురుష లక్షణం అని నూరి పోసింది.

టైం చూశాడు. ఐదూ పదహారు. పదహారూ ప్రాయంలో నాకొక గర్ల్ ఫ్రెండ్ కావాలి... స్త్రీ సహజమైన మమతాసూయలతో తల్లికామె నచ్చలేదు. ఇంకెవ్వరూ అతనికి నచ్చలేదు. ఎండిపోయిన నీళ్ల గ్లాసులో చారికలు కట్టినట్టు ఏవో జ్ఞాపకాలు. తల్లి ఎంత చక్కగా పెంచింది తనని. పట్టాలు తప్పని గూడ్సుబండిలా పొడవుగా అందంగా మంచివాడిగా బరువు మోసేవాడిలా.

వికారం తగ్గేట్టు లేదు. తన వాంతికింత చోటిచ్చి ఆదరించిన రోడ్డుకి కృతజ్ఞత చెప్పి నెమ్మదిగా బయలుదేరాడు. ఎదురుగా బైక్ మీద ఒక జంట. ఆలుమగలు అవునో కాదో. నవ్వుకున్నాడు. కలిసున్న ఏ ఇద్దర్ని చూసినా ఈ ప్రశ్న మదిలో మెలగటం అతనికి కొత్తేమీ కాదు. ఆమె పట్టుచీరకు నప్పేట్లు కొప్పునిండా చేమంతి పూలు. కబుర్లు చెప్పుకుంటూ వెళ్తున్న వాళ్లిద్దరి ముఖాలు చూడాలనిపించింది. కొంచెం వేగంగా ఎడమ నుంచి క్రాస్ చేశాడు. కర్పూర వీటికామోద సమాకర్షదిగంతరా.

అతనికి తెలిసిన పెళ్లి భోజనం పప్పన్నం, కిళ్లీ, కర్పూరం కడ్డీ. మానవుడు వాసనా బలం గలిగినవాడు. జన్మజన్మల వాసన కుడివైపు అరేబియన్ దర్బార్ నుంచి వస్తున్న పేగులు కాలుతున్న వాసన కన్నా దుర్భరమైనది. ఎందుకీ వేళ ఇంత ఆలోచిస్తున్నాడు? 'మనువు' నుంచి వచ్చిన వాడు మానవుడా? 'మనువు' ద్వారా పేగు తెంచుకున్న వాడు మానవుడా? అసలు తనకి ఇన్ని విషయాలు ఎలా తెలుస్తున్నాయని అతని మీద అతనికే ఆశ్చర్యం వేసింది.

ఎదురుగా మరో రెడ్ సిగ్నల్. చచ్చినట్టు ఆగాల్సి వచ్చింది. బైకులు కార్లు బస్సులు స్టాప్ లైన్ దాటకుండా చక్కగా సర్దుకుంటున్నాయి. భూమ్మీద నాగరికతలన్నీ చక్కగా నదుల ఒడ్డున సర్దుకున్నట్టు. సమయం చూసి సందు చూసి వేరే వాళ్ల స్థలాన్ని కబ్జా చేసినట్టు బైకులు చాకచక్యంగా మున్ముందుకు దూరుతుంటే ముందుకు గాని వెనక్కుగాని వెళ్లలేని నిస్సహాయస్థితిలో ఏమీ చేయలేని ముసలి స్థల యజమానుల్లా కార్లు నిలబడిపోతున్నాయి. ఈ నూట ఇరవై సెకన్లలోనే చోటు కోసం ఇంత గొడవైతే జీవిత పర్యంతం ఎన్నో గొడవలుండటంలో తప్పు లేదనిపించింది అతనికి. బాబాయి చేసింది సరైనదే.

ఆకుపచ్చ పడ్డా ట్రాఫిక్ పోలీస్ వెళ్లనివ్వడంలేదు. అటువైపు నుంచి అంబులెన్సు. అందులో ఇద్దరు మనుషులు ఎదురెదురుగా కూర్చొని లోపలి వైపు కిందకు చూస్తున్నారు. బొయ్యి బొయ్యిమని చప్పుడు చేసే సైరెన్. అసలు ఆ చప్పుడుకే పేషెంట్ సగం చస్తాడేమో అనిపిస్తుంది. అతను ఎప్పుడూ అంబులెన్సును చూసినా 'ఈ ప్రాణాన్ని కాపాడు దేవుడా,' అని ఒకసారైనా అనుకుంటాడు. చిన్నపుడు చదివిన ఒక కథ ప్రభావం అది. ప్రార్థనలు ఆయుష్షును పెంచుతాయని చావుకి భయపడే ప్రతివాడూ అనుకుంటాడు. ఆక్సిజన్ సిలిండర్ లేని దీనస్థితిలో ఉన్న ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో పది లక్షలు పోసి కొన్న తండ్రి శవంతో ఆరోజు అంబులెన్సులో ఇలానే ఆ ఇద్దరి స్థానంలో తానూ తల్లీ. అప్పుడు ముక్కోటి దేవతలని ప్రార్థించానని తర్వాత తల్లి చెప్పింది. ఈ విషయంలో హిందూ ధర్మం మనిషికి చాలా ఛాయిస్‌ని ఇచ్చింది.

అతను ఏ ఆప్షన్ సెలెక్ట్ చేసుకోవాలో తెలియక 'దేవుడా' అనబడే ఒకే ఒక దేవుణ్ణి ప్రార్థించాడు.

హార్న్ కొట్టీ కొట్టీ విసుక్కుని చేమంతి కొప్పు అతన్ని దాటుకుని ముందర ఇరుక్కుంది. ఆ విసురుకి చేమంతి రెక్క ఒకటి రాలి కుందన్ల మెరుపుల లో నెక్ బ్లౌజ్ మధ్య కావి రంగులో కాంతులీనుతున్న ఆమె వీపు మీద పడింది. అతని కుడి బుగ్గ మీద నుంచి ఒక కన్నీటి చుక్క రాలి చేతి మీద పడింది. ఉలిక్కిపడి విదిలించాడు. టైం ఐదూ ఇరవై. నింపాదిగా ట్రాఫిక్ పోలీస్ దగ్గరకు వెళ్లి అతన్ని అభినందించాడు. మంచికింకా ఈ లోకంలో చోటుందని చాటావన్నాడు. పోలీస్ మొహమాటానికి ముందు సిగ్గుపడ్డా తర్వాత కాలరెగరేశాడు.

పెట్రోల్, డీజిల్ వాహనాలను నడిపినట్టు నమ్మకం మనిషిని నడిపిస్తుంది. ఒకోసారి పరిగెత్తిస్తుంది కూడా. ఎంత దూరం ఆ ప్రయాణం? ఎక్కడికి అది? సంకల్పబలం అనేది హనుమంతుణ్ణి దక్షిణ సముద్రం దాటించినట్టు మనిషిని ఎత్తి గిరవాటు వేయగలుగుతుంది. ఇదంతా లక్ష్యం అంటూ ఒకటి ఏడిసినప్పుడు. చుక్కాని లేని నావలా చాలా జీవితాలు ఉంటాయి కదూ. నడకా లేక నడిపించేవారూ లేక. బతుక్కి గమ్యం లేకపోతే ఏమి? కర్మయోగం ఉందిగా.

పొడవాటి ఇనుప కడ్డీలు కట్టగట్టి తీసుకెళ్తున్న ట్రాలీ. పసుపు రంగు ట్రాలీ కనపడింది గాని సంజె చీకట్లో చువ్వలు కనపడలేదు. చాల దగ్గరికొచ్చాక బండి పక్కకు తిప్పాడు. త్రుటిలో ఘోరం తప్పింది. ట్రాలీ కుడివైపు అద్దం పగిలింది. గుండె లబాలబా కొట్టుకున్న ట్రాలీవాడు కిందకు దిగి తిట్లు అందుకున్నాడు. అతను 'సారీ భయ్యా' అనంటూ వాలెట్ తీసి ఐదు వందలు ఇచ్చాడు. పర్సు జేబులో పెట్టుకుంటూ వాచీ వంక చూసుకున్నాడు. ఐదు ఇరవై ఐదు. సరిగ్గా ఐదైదు నిమిషాలకు చూసుకుంటు న్నానే అనుకొని నవ్వుకున్నాడు.

ఇదేమీ పట్టనట్టు వెళ్లిపోయినాయి ఇతర వాహనాలు. ఛ ఛ వాహనాలు వెళ్లవు. మనము తీసుకెళ్తే వెళ్తాయి. యంత్రాలవి. వాటిలో కూర్చునేదీ యంత్రాలే. దెబ్బతిన్న మనుషులకు వాటిలో చోటుండదు. ఎందుకంటే దెబ్బ తగిలితే బుద్ధి వికసిస్తుంది. ఆ వెంటనే హృదయం విచ్చుకుంటుంది. ఈ రెండూ కాసులు రాల్చలేవు. సమయమే ధనం. ధనానికి ఇనప్పెట్టెలో చోటుంటుంది. హృదయమే లేనప్పుడు బుద్ధే లేనప్పుడు సమయానికింక చోటెక్కడ? అందుకే కదిలిపోతుంటుంది.

కదిలే కాలం గురించి ఆలోచిస్తూ తను కదలకుండా ఉండిపోతే ఎలా? అర గంటలో చేరుకోవాలనుకుని మొదలుపెట్టాడు. కాలంతో పోటీపడి గెలిచిన మొనగాడు ఇంకా పుట్టలేదు. అరవై దాటినా ఎనభై దాటుతున్నా... అది వయసైనా వేగమైనా.

ఏదో పెళ్లి ఊరేగింపులా ఉంది. ఆ వైభవం చూడు. గుర్రాల రథం. ధగధగ లాడే విద్యుద్దీపాలు. మిలమిలలాడే ముఖాలూ బట్టలూ. పెళపెళలాడే వయసు. తర్వాత్తర్వాత వీళ్లే కళవెళపోతారని ఎవ్వరికీ తెలియనట్టు అసలా అవకాశమే లేనట్టూ

డప్పులు డాన్సులు. ఎందుకింత ఉత్సాహం? తనకెందుకింత నిరుత్సాహం అనుకొని తల విదిల్చాడు.

వాంతి బైకూ, చేమంతి కొప్పు, కడ్డీల ట్రాలీ అన్నీ ఆగిపోయినాయి. ఎంత వేగ ప్రవాహమైనా కట్ట కడితే ఆగినట్టు, కులాసాగా సాగిపోతున్న జీవితం మూడు ముళ్ల కట్ట దగ్గర ఆగాల్సిందేనని తల్లి చెప్పింది. కలిసి ప్రవహిస్తాయి అనుకున్న రెండు పాయలూ దేని దారిన అవి పారాయి. అవి కలిసిన కొద్ది దూరంలోనే అందమైన దీవి ఏర్పడింది స్థిరంగా. ఆ దీవిని వదిలి రాక తప్పలేదు అతనికి. ఎప్పుడో దాటేసిన మజిలీ అది.

ఇప్పుడు ఇది దాటాలంటే ఆలస్యమయేలా ఉంది. దగ్గరి దారి కోసం అటూ ఇటూ చూశాడు. ఫ్లై ఓవర్ ఎక్కితే మళ్లీ దిగి చుట్టూ తిరిగి వెళ్లాలి. తప్పదు. ఎలాగో చోటు చేసుకొని చిన్నగా ఫ్లై ఓవర్ అంచుకి చేరుకున్నాడు. తాము చూస్తున్న వినోదానికి ఆటంకం కలిగిస్తూన్న అతని మీద చిర్రుబుర్రులాడుతూనే కదిలారు అడ్డంగా ఉన్న వాళ్లు.

ఫ్లైఓవర్ మీద ప్రయాణం అతనికిష్టం. ఈ బేవార్సు లోకానికి పైన అంతెత్తునున్నట్టు భ్రమపడటమంటే మోజు. ఎందుకనో ఎక్కువ మంది ఈ ఎత్తు దాకా రారు. వచ్చినా ఆ ఎత్తులో ఎక్కువ సేపు నిలవలేరు. నిలుపుకోలేరు అనాలేమో కదా?

చెయ్యెత్తు మనిషి ఆమె. జీన్స్, టీ-షర్ట్ ఆమె యూనిఫామ్. షర్ట్ తియ్యకుండా బ్రా విప్పి తీసెయ్యగలదు. ఎంతోమంది తత్తరపడే ఈ ఫీట్‌ను ఆమె అవలీలగా చేసేసేది. అదే బాస్ కి నచ్చడంతో ప్రమోషన్ ఇచ్చాడు. ముందు బ్రా వాడిన ఆమె తరువాత బ్రెయిన్ వాడటం మొదలుపెట్టి ఎంతో ఎత్తుకి ఎదిగింది. దాంతో పోటీదారులు ఆమెకు స్వర్గంలో చోటు చేశారు. అప్సరసలు స్వర్గంలోనే కదా మరి ఉండాలి! ఆమెకు కంపెనీ ఇచ్చిన ఫ్లాట్‌ని ఖాళీ చేయటానికి వచ్చిన చెల్లెలు అక్క బట్టలన్నిటినీ అనాథ శరణాలయంలో ఇచ్చేసింది. ఆమె చూడకుండా తస్కరించిన ఒక నల్లటి లేస్ బ్రా ఇంకా అతని అండర్‌వేర్ల మధ్య గర్వంగా ఉందంటే అతని మనసులో ఆమెకెంత చోటుందో తెలీడంలా?

ఇంకా పది కిలోమీటర్లు ఉంది. టైం పది నిముషాలే ఉంది. లాస్ట్ ఓవర్, సిక్స్ రన్స్ ఫర్ విక్టరీ అన్నట్టు. ఆడగలడా? ‘నేను సెంచరీ నాటవుట్’ అని పిలిచి పిలిచి చెప్పే ఎదురింటాయన సిక్టీకే బౌల్డ్ కాలా? వజ్రదేహుడైన పక్కింటాయన కాలి చిటికెన వేలికి సెప్టిక్ అయి వొళ్లంతా ఇన్ఫెక్షన్ వచ్చి పోలా? చివరిదాకా వచ్చి ఆఖరి అడుగులో కుప్పకూలిపోవటం వింతనుకుంటాం. చావుకి చోటుండదని అనుకుంటాం. అరబ్బు షేకూ ఒంటె కథ లాగా, వస్తే చోటంతా దానిదే.

ఎన్నో అనుకున్నాడు దారిలో చేద్దామని. వీలైతే ఒక ప్లేట్ భోజనం, కుదిరితే నాలుగు కప్పుల చాయ్, ఇంకా వీలైతే ఒక దమ్ము- ఉహూ ఏవీ కుదరలా. తన ప్రయాణంలో వాటికి ఓ గౌరవప్రదమైన చోటుని కల్పించాలనుకున్నాడు. చలించని సమయంతో సమానంగా వెళ్లాలంటే తను చలించకూడదనుకుని వాటిని మరచి

పోయాడు. అయినా ఏమిటో లేటయిపోయింది. కాల్ చేస్తుంటే మిత్రులు జవాబే ఇవ్వటం లేదు. ఏమైపోయారంతా?

ఆఫీస్‌లో ఆరింటికి పంచ్ చేయాలి. లేకపోతే సగంరోజు జీతం దండగ. ఈ నిరామయ నిర్వికల్ప సంకల్పంతో ఐదింటికే బయలుదేరాడు. ఫ్యూయల్ రెడ్‌లో పడిన సంగతి నిన్న చూసుకోలేదు. పెట్రోల్ బంక్ దగ్గర స్వైపింగ్ మెషిన్ పని చెయ్య లేదని పది నిముషాలు మింగాడు పిలగాడు. కోపాన్ని మింగలేకా కక్కలేకా కదిలాడు అతను.

చేరుకునేసరికి ఐదు యాభై తొమ్మిది. సంతోషంతో చల్లటి ఏసీ వాతావరణం లోకి అడుగుపెట్టాడు. విజయగర్వంతో పంచ్ చేసి, మొబైల్ ఫోన్‌ని లాకర్లో పెట్టి వచ్చి తన సీట్లో కూర్చున్నాడు. అప్పటికే అంతా పనిలో మునిగిపోయారు నిజంగా పనున్నట్టు, నిజంగానే పని చేస్తున్నట్టు. ఏదో తేడా ఉందే అనుకుంటున్నాడు. ఇంతలో బాస్ పిలిచాడు ఇంటర్‌కంలో. నిస్సంకోచంగా వెళ్లాడు.

"ఇప్పుడు టైం ఎంతైందో తెలుసా?" బాస్ గద్దించాడు.

"ఆరూ ఒకటి"

"ఎనిమిది ఇరవై" రెట్టించి అన్నాడు.

"ఆర్యూ జోకింగ్?" అందరు తెలుగువాళ్లలాగే ఎమోషన్లో ఇంగ్లీష్ మాట్లాడాడు.

"చెక్" అని అధికారి తన మొబైల్ని, గోడ మీద గడియారాన్ని, డెస్క్‌టాప్‌ని, చేతికున్న వాచీని చూపించాడు. ఇన్ని ఆధారాలనీ తలదన్నే ఆధారం తన పాత వాచీ వంక చూశాడు అతను. ఐదు యాభై తొమ్మిది దగ్గర ఆగిపోయింది అది. యుద్ధంలో అమితంగా గాయపడ్డ గుర్రం పరిగెత్తకపోయినా కుంటుకుంటూ నడిచి తన రౌతును మాత్రం క్షేమంగా ఇంటికి చేర్చి ప్రాణాలు వదిలినట్టు.

*తెలుగుపలుకు - తానాసభల జ్ఞాపిక*
*2017*

✻



12 జూన్ 1987న పుట్టిన మోహిత మొదటి కథ అర్ధశతాబ్దపు అజ్ఞానం జూన్ 2014 కౌముది.నెట్ అంతర్జాల పత్రికలో ప్రచురితమయ్యింది. మూసి మాసపత్రికలో కాలమ్ నిర్వహించారు. ఆంధ్రప్రభ వారపత్రికలో ఒక కాలమ్ నిర్వహించారు, కొన్ని కవితలు ప్రచురించారు. కొన్ని కథలను ఇతర భాషల నుండి తెలుగులోకి అనువదించారు. ఆలిండియా రేడియోలో రేడియోజాకీగా పనిచేస్తున్నారు.

*చిరునామా: ఫ్లాట్ నెం. 303, ప్లెసెంట్ టవర్స్, మెథడిస్ట్ చర్చి ఎదురుగా*
*హైదర్షాకోట, హైదరాబాద్-500091. ఫోన్: 98859 07062*
**kaundinya.mohita08@gmail.com**